# పరిధి

బస్సు దిగి సామాను లెక్క చూచుకుంటున్న నా భుజంమీద చెయ్యి పడ్డది. వెనక్కు తిరిగి చూశాను.

'ప్రసాద్. యెన్నాళ్ళకు కన్పించావోయ్. మనిషివి బాగా మారిపోయావు సుమా—' అన్నదో కంఠం.

పలుకరించిన మనిషిని వెంటనే గుర్తించలేక గతంలో నా స్నేహితు లందరినీ ఓమారు ఆకళింపు చేసుకున్నాను క్షణంలో...

పీక్కుపోయిన కళ్ళు, రేగినజుట్టు, మాసినగడ్డం, మురికి గుడ్డలతో వున్నవ్యక్తిని వెంటనే పోల్చుకోలేక పోయాను.

---

ఏప్రిల్ '67 మంజులతలో ప్రచురితము

'సారీ! నువ్వు నన్ను గుర్తించ లేదనుకుంటూ...'

అతడిని ఏ విధంగ, సామాధాన పర్చాలో అర్థంగాక "మీరు ఇక్కడెందుకున్నారు?" అన్నాను.

"అయితే పూర్తిగ మర్చిపోయావన్నమాట. అవున్లే ఈ పరిస్థితుల్లో నువ్వేగాదు... ఎవ్వరైనా అంతే... నేను ప్రసాద్, రామానుజాన్ని!—"

నా బుర్ర గిర్రున తిరిగింది—

రామానుజం... అవును రామానుజమే!... ఆనాటి నాస్నేహితుడు రామానుజంలా లేడిప్పుడు...

'క్షమించు బ్రదర్. ఏమిటిలా అయిపోయావ్!—' అనేసి నా బాహువుల్లో ఇముడ్చుకున్నాను.

"ఫర్వాలేదులేవోయ్ మనిద్దరం కల్సుకుని ఏ పది సంవత్సరాలో దాటింది... అది నీ తప్పుగాదు... నాలో వచ్చిన మార్పు!"

సామాను కూలీకి వప్పచెప్పి ఇద్దరం కాఫీకి బయల్దేరాం.

రామానుజం మనిషి బాగా మారిపోయాడు. ఇదివరకు మనిషిలాలేడు. వెంటనే గుర్తించ లేనందుకు నన్ను నేను మనసులో నిందించుకున్నాను.

కాఫీ త్రాగి బైటికొచ్చేవరకు గత పదేళ్ళనుండి తను పడుతున్న బాధలన్నీ ఏకరువు పెడుతూనే వున్నాడు. నాకు అతని పరిస్థితి చూసి జాలివేసింది. కళ్ళలో నీరు నిల్చింది.

మళ్ళీ ఇద్దరం బస్టాండులో కొచ్చాం.

మావూరు చేరుకునేందుకు మరో బస్సెక్కాలి.

రామానుజం ఇంకా చెప్తూనే వున్నాడు...

బస్సొచ్చింది సార్ అన్నాడు కూలి...

సామాను బస్సుమీద పెట్టించి డబ్బు లిచ్చి కూలీని పంపేశాను.

మరోనిముషంలో బస్సు బయల్దేరబోతోంది.

రామానుజం కళ్ళల్లోకి జాలిగ చూస్తూ, "బ్రదర్ ఏమనుకోకు. ఇలారా ఓమారు" అంటూ నన్ను పదిగజాలు ప్రక్కకు తీసుకెళ్ళాడు.

ఏదో అడగాలనే ఆత్రం అతని కళ్ళల్లో తొంగి చూడటం గమనించాను. అడక్కూడదనే అభిమానం ఆతని ముఖంలో వ్యక్తమాతోంది.

"విషయమేమిటో చెప్పు. ఫర్వాలేదు. నాదగ్గర దాస్తావేం..."

నేలచూపులు చూస్తూ, "మరేంలేదు. నిన్నుచూచేక నా ప్రాణం లేచొచ్చింది.— విషయమంతా చెప్పానుగా?— అదీ నాపరిస్థితి. నా మిసెస్ హాస్పిటల్లోవుంది... ఓ పదిరూపాయలుంటే సాయంచెయ్యి. వీలుచూసుకు పంపుతాను..." బిడియపడుతూనే అడిగేడు.

రామానుజం ముఖంలో దీనత్వం నన్ను కదిలించింది. వెంటనే రెండు పదులుతీసి అతని చేతిలోపెట్టి 'ఇదివుంచు' అన్నాను ముక్తసరిగ.

"ప్రసాద్. నన్ను చూస్తుంటే... నీకేమనిపిస్తున్నది. నావంటి నిర్భాగ్యుడు మరొకడుండడు...కదూ ?-"

అదేమిటోయ్ ? ఇందులో అభిమానం పడాల్సిందేముంది. నాదగ్గర నీకా స్వాతంత్రం యెప్పుడూ వుంది.

'నాకు తెలుసు. స్నేహితులే బ్రదర్ ఆపదలో ఆదుకునేది. భగవంతుడు నన్ను అన్యాయంచేసినా, నీ వంటివాళ్ళ మంచితనమే నన్నింకా బ్రతికిస్తోంది.'

బాధపడకు. మనం వూహించని పరిస్థితులు కొన్ని... మనలో వుండే పద్ధతులను మార్చుకోలేక బాధపడాల్సిన పరిస్థితులు మరికొన్ని...

బస్ హారన్ మోగింది.

"నేవస్తా రామానుజం. అవసరమున్నపుడు లెటర్సు వ్రాస్తుండు' అనేసి వచ్చి బస్సెక్కాను.

నువ్వు దేవుడిలా ఆపదలో అడ్డుపడ్డావు ప్రసాద్. నీ మేలు మర్చిపోలేను, అనేసి రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టాడు.

'ఛ... మనలో మనకు అవేం మాటలు......?

ఒక్క వూపుతో బస్సు ముందుకు కదిలింది.

ఓ నిట్టూర్పు విడిచాను. చెమ్మగిల్లిన కళ్ళు రుమాలుతో తుడుచుకుని సిగరెట్ ముట్టించాను.

బస్సు ముందుకు పరుగెడుతున్నా, అనంత వేగంతో నా ఆలోచన్లు వెనక్కు పరుగెత్తుతున్నాయి...

ఎలాంటి రామానుజం యెట్లా అయ్యాడు!

రామానుజం నాకంటే తెలివైనవాడు, మంచి మాటకారి. ఎదుటివాళ్ళను ఆకట్టుకునే కలుపుగోరుతనం, చనువు, చొరవ వాడిలో యెంతోవుంది—

ఇద్దరం ఒకేసారి వుద్యోగంలో చేరాం—

సంవత్సరం గడిచేక ఇద్దరినీ ప్రమోషన్ మీద కర్నూలు బదిలీ చేశారు.

ఇద్దరికీ కర్నూలు క్రొత్త ప్రదేశమే. వెళ్ళిన పదిరోజుల్లోనే రామానుజం బోలెడు పలుకుబడి సంపాదించాడు.

నా పద్ధతి చూచి నేను మనుష్యుల్ని తినే పాములనని, ప్రాపకం సంపాదించుకోటం చేతగాదని, అమాయకుడినని అనేవాడు. నవ్వి వూరుకునేవాడిని నేను.

రామానుజం ఓ చిత్రమైన మనిషి. వాడి అభిరుచులు, అభిప్రాయాలు అన్నీ నా మనస్తత్వానికి భిన్నంగానే వుండేవి.

అయినా సరే వాడంటే నా కెందుకో అభిమానం. చెప్పలేని ప్రేమ.

వాడి ప్రవర్తన గురించి ఎన్నోసార్లు హెచ్చరించాను. మందలించాను.

ప్రతి వ్యక్తిని వెంటనే నమ్మే స్వభావం వాడిది. మనుష్యుల నర్థం చేసుకోకుండ స్నేహాన్ని పెంచుకునేవాడు.

ఏదో విధంగ లైఫ్‌లో పైనవటమే వాడి లక్ష్యం... వాడి లక్ష్యం ఏవిధమైన గమ్యాన్ని చేరుతుందో నాకు అర్థమయ్యేదే కాదు.

నాకంటే రామానుజానికి ఆఫీసులో పలుకుబడి యెక్కువ. హెడ్‌క్లార్కును కూడా ఖాతరు చెయ్యకుండ ఆఫీసరు దగ్గరే కూర్చుని కాఫీలు త్రాగేవాడు. కార్లో తిరిగేవాడు.

ఓ రోజున ఇద్దరం రోడ్డుమీద నడుస్తున్నాం—

"రామానుజం. సినిమా కెడదామా ?"

'అన్నట్టు. మర్చేపోయాను ప్రసాదూ! నన్ను శ్రీనివాసంగారు సినీమాకు టిక్కెట్లు రిజర్వు చెయ్యమన్నారు. పద ... పద ..."

"అవున్లే. ఆఫీసర్ల ప్రక్కన తిరిగేనీకు మేంకన్పిస్తామా?"

"ఏమిటోయ్ నీ మెత్తిపొడుపు మాటలు. మనంచేసే గుమాస్తా వుద్యోగంలో ప్రాపకం సంపాదించుకునే పద్ధతుల్లో ఇదొకటి. ఆఫీసర్లనే ఆ కట్టుకుంటే ... ఇక మనపని మూడు పువ్వు లారుకాయలనుకో ..."

"నువ్వు ఏమి అనుకోనంటే ... నాదో చిన్న సలహా"

"చెప్పు ఫర్వాలేదు" మెటో చూస్తూ అన్నాడు.

మనం గుమాస్తాల మనేమాట మర్చిపోతున్నావు. వాళ్ళు ఆఫీసర్లు. వాళ్ళకు మనకు పొత్తుకుదరదు. కేవలం వారి అవసరాలకు మనలను యంత్రాల్లాగ వాడుకుంటారు. అంత రాలను మర్చిపోయి వ్యవహరిస్తే మన కేనాటికైనా ముప్పే"

'నాకామాత్రం తెలీదా ప్రసాద్ — అయ్యగారికి బ్రాందీబుడ్లు సప్లైదగ్గరినుంచి ఆటవిడుపుదాకా మనతోనే అవసరం. అలాంటి మనలను కాదని వాడేం చేయగలడు ...'

'సరే నీయిష్టం. వింటావేమోని చెప్పిచూశాను తర్వాత నీ ఇష్టం మరినేవస్తా ... ఇంటిదగ్గర శ్రీమతి యెదురు చూస్తుం టుంది' అనేసి ఇంటివేపు నడిచాను.

రామానుజం పలుకుబడి, పరపతి పెరుగుతూ వచ్చింది. ఆఫీసరును మించిన హోదా—అంతకుమించిన అహం.

ఇంట్లో అప్పుడేటు పర్నిచరు, ఫేను, రేడియో పెద్ద స్టేటస్ కన్పిస్తుంది రామానుజం ఇంట్లో ...

ఆఫీసులో చిన్నమెత్తుపనంటూ చెయ్యడు. ఆరు గంటలసేపూ అందరినీ కూడగట్టుకుని కబుర్లుచెప్తాడు. ఐదు అయ్యేసరికల్లా ఆఫీసరుతో బాటు కార్లో బయల్దేరుతాడు.

రామానుజం పద్ధతికి ఈర్ష్యపడేవాళ్ళు, పరోక్షంగ అత డిని తిట్టేవాళ్ళు ఆఫీసులో తయారయ్యారు.

పైకి అతనితో నవ్వుతూ, మాట్లాడుతూ లోలోపల వాడిని ఆడిపోసుకోవటం యెన్నోసార్లు నాకళ్ళపడ్డది.

కాకారావ్ అని కొందరంటే అలాంటి బంట్రోతు బ్రతుకు బ్రతకక్కపోలేమని మరికొందరనుకునేవాళ్లు.

రామానుజం ఇవ్వేమీ పట్టించుకునే వాడుగాడు. వాడి యెదుట అనేధైర్యం యెవ్వరికీ లేదు.

ఆఫీసులో పరిస్థితులు విషమిస్తున్నాయని యెన్నోసార్లు వాడితో చెప్పటం జరిగినా, నామాట పెడచెవిన పెడుతూ వచ్చాడు. నా మందలింపుకు సమాధానంగా చిరునవ్వు నవ్వి చూడు బ్రదర్ పైనవటంచూచి ఓర్వలేని వాళ్ళు ఆవిధంగ ఆడిపోసుకోవటం, దుమ్మెత్తుబట్టం వారి అలవాటు. యెదుటివాడు బాగుపడటంగాని, పచ్చగా వుండటంగాని యెవ్వరికీ గిట్టదు. లోకంతీరే అంత!— నాగురించి నువ్వేం భయపడకు అనే వాడు. నా అవసరాలకు యెన్నోసార్లు డబ్బు సాయంచేశాడు. బ్రతకటం నేర్చుకో బ్రదర్ అనేసి హితోపదేశాలు చేసే వాడు. ఆఫీసుకు అరగంట లేటుగ వచ్చినా, శలవుచీటి పంపక పోయినా చెలామణి అవుతున్నాడు.

ఊరుకోలేక ఓరోజు వాడితో 'చూడు రామానుజం. నువ్వంటే హెడ్ క్లార్కు మండిపడుతున్నాడు కాస్త నీ తరహా

మార్చుకుంటే నయం... లేకపోతే ఏం జరుగుతుందో వూహించలేం'' అన్నాను.

"వడ్డించే దేవుడు మనవాడైతే మధ్యనుండే వుత్సవిగ్రహాల కేందుకోయ్ భయపడటం."

"పూజారి నొకంట కనిపెట్టకపోతే దేవుడుకూడా ఏనాటికైనా ఆగ్రహించకమానడు..."

"ఏడిశాడు. వాడి మామూలు వాడికి గిడుతున్నప్పుడు మనదాకా యెందుకొస్తాడు నీ పిచ్చిగాని..."

"సరే నీయిష్టం. కావలసినవాడివి గదాని హెచ్చరించాను. పరిస్థితులు విషమిస్తే అనుకుని ప్రయోజనం లేదు.—చూడు రామానుజం! నాదో చిన్న సలహా, తండ్రి బిడ్డను వరే అనవచ్చుగాని, బిడ్డ తండ్రిని వరే'' అనే అర్హతగానీ, తాహతుగానీ లేదు."

"అక్కచ్చమ్మ కబుర్లు చెప్పకోయ్, నాకు చెడ్డ చిరాకు'' అనేసి సంభాషణ ముగించాడు.

ఎన్ని విధాల చెప్పి చూసినా, రామానుజంలో మార్పు రాకుండావుంది.

వాడి పరిస్థితికి నేను గర్వించాలో, జాలిపడాలో అర్థం కాకుండావుంది.

ఓ నెల రోజులు శెలవుపెట్టి పొలం పనిమీద మావూరెళ్లాను—

◆ ◆ ◆

ఆఫీసు కెళ్ళాను. రామానుజం కన్పించలేదు. వాడూ శలవులో ఏవూరైనా వెళ్ళాడేమో ననుకున్నాను.

లంచ్ టైంలో హోటల్లో కాఫీ తాగుతుంటే ప్రక్కనే కూర్చున్న శ్రీధరం "ప్రసాదూ! రామానుజం అన్యాయమై నాడు నీకు తెలుసా ?—" అన్నాడు.

ఆ మాట వినేసరికి గతుక్కుమన్నాను. ఓక్షణంపాటు స్థంభించి పోయాను.

"ఏం జరిగింది శ్రీధరం !—"

"అంతా మనం అనుకున్నట్లే జరిగింది. అసలు రామానుజానికి ముందుచూపేగాని వెనకాలోచన లేదు..."

అసలు విషయమేమిటి ?—

"చేసినన్నాళ్ళూ చెలామణి అయిన రామానుజం. పాపం చెయ్యని నేరానికి శిక్ష అనుభవించాడు..."

"అంటే..."

"నువ్వు శెలవులో వెళ్ళాకనే ఇదంతా జరిగింది. ఏదో కేసులో చెయ్యి చాచాడని అనుమానంతో వుద్యోగంలో నుంచి డిస్మిస్సయ్యాడు."

"మరి... శ్రీనివాసంగారు నిజం తెల్సుకోకుండానే ఇంతపనీ చేశారా ?—"

"నిజం ఎవరిక్కావాలోయ్... ఆఫీసర్ మనవాడే గదా, సాయం చెయ్యకపోతాడాని అపోహ పడ్డాడు..."

"పాపం! రామానుజం!" అని గొణుకున్నాడు.

నా ఆలోచనల్లో అంతరాయంగా కండక్టరు మావూరొచ్చిందంటూ కేకేశాడు- నిట్టూర్పు విడిచి బస్సు దిగేను బరువుగ.